క్లుప్తంగా

మామిడి రైతులను ఆదుకోవాలి

రాయచోటి టౌన్ : మామిడి రైతులు సంక్షోభంలో పడ్డారని వారిని ఆదుకోవాల్సిన బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఉందని రాయచోటి మండల లీగల్ సర్వీసెస్ కమిటీ మాజీ సభ్యులు యర్రప్పరెడ్డి విశ్వనాథరెడ్డి డిమాండ్ చేశారు. నేడు సత్యసాయి జిల్లాలో కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమశాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ పర్యటిస్తున్నారన్న విషయం విధితమేనన్నారు. ఆయన దృష్టికి రాష్ట్రంలో మామిడి రైతులు నష్టపోయిన తీరును రాష్ట్ర ప్రభుత్వం వివరించాలని కోరారు. రాష్ట్రంలో ప్రధానంగా రాయలసీమలో మామిడి రైతులు తీవ్రంగా నష్టపోయారని తెలిపారు. కర్నాటక, తమిళనాడు రాష్ట్రాల్లో మామిడి రైతులకు ఇచ్చిన విధంగా మన రాష్ట్రంలోనూ క్వింటాలు రూ.1,616లతో కొనుగోలు చేయాలని కోరారు.

విత్తనశుద్ధి తప్పనిసరి

సంబేపల్లె : మండల పరిధిలోని గున్నికుంట్ల, గురిగింజకుంట గ్రామాలలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని మండల వ్యవసాయశాఖ అధికారి కిషోర్‌నాయక్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాగు చేసే ప్రతి పంటకు విత్తన శుద్ధి అవసరమని తెలిపారు. సాగుచేసే ప్రతి పంటను ఇ–క్రాప్‌లో నమోదు చేసుకోవాలన్నారు. అనంతరం రైతులకు పంటల సాగుపై సూచనలు సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి రెడ్డివెంకటరమణ, వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

రైతులకు 13 వరకు అవకాశం

గాలివీడు : అన్నదాత సుఖీభవ సవరణల కోసం ఈనెల 13వ తేదీ వరకు గడువు ఉందని లక్కిరెడ్డిపల్లి ఏడీఏ జయరాణి తెలిపారు. బుధవారం మండల పరిధిలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. రైతులకు ఖరీఫ్ గాను ప్రధానమంత్రి ఫసల్ బీమా, వాతావరణ బీమా కింద వరి, వేరుశనగ, కంది, టమాటా, అరటి పంటలకు ఇన్సూరెన్స్ చేసుకోవచ్చన్నారు. ప్రతి రైతు తమ ఆధార్ కార్డ్‌తో రైతు సేవా కేంద్రంలో అన్నదాత సుఖీభవ పథకానికి అర్హత ఉందా, లేదా అనే విషయం తెలుసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో ఏఓ గౌతమి, ఏఈఓ మణి, వీఏఏ మహమ్మద్ అలీ, వీహెచ్ఏ శివ లలిత పాల్గొన్నారు.

గర్భిణులకు వైద్య పరీక్షలు

వీరబల్లి : మండల ఆరోగ్య కేంద్రంలో బుధవారం గర్భిణులకు ప్రత్యేకంగా వైద్య పరీక్షలు నిర్వహించారు. డాక్టర్ మనీషా ఆధ్వర్యంలో ఈ వైద్య పరీక్షలు జరిపి మందులు అందించారు. ఎంపీపీ గాలివీటి రాజేంద్రనాథ్ రెడ్డి తన సొంత నిధులతో భోజనాలు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారం అందజేత

లక్కిరెడ్డిపల్లె : టీబీ వ్యాధిగ్రస్తులు మంచి ఆహారం తీసుకోవాలని లక్కిరెడ్డిపల్లె ఏరియా ఆసుపత్రి సూపరింటెంట్ నీలోఫర్ భేగం పేర్కొన్నారు.బుధవారం స్థానిక ఏరియా ఆసుపత్రిలో టీబీ రోగులకు పౌష్టికాహారం పంపిణీ చేశారు.

ఎంపీ దృష్టికి చింతరాజుపల్లి సమస్యలు

ఒంటిమిట్ట : మండల పరిధిలోని చింతరాజుపల్లి పంచాయతీ సమస్యలను పరిష్కరించేందుకు రాజ్యసభ సభ్యుడు మేడా రఘునాథరెడ్డి, రాజంపేట నియోజకవర్గం వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్ ఆకేపాటి అనిల్‌కుమార్ రెడ్డిల దృష్టికి బుధవారం రాజంపేటలోని పార్టీ కార్యాలయంలో ఆ గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకులు తీసుకెళ్లడం జరిగింది. సమస్యలు విన్న ఎంపీ మేడా, ఆకేపాటి అనిల్ సానుకూలంగా స్పందించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బొడ్డే శ్రీనివాసులు నాయుడు, ఒంటిమిట్ట ప్రచార విభాగ అధ్యక్షులు రాజశేఖర్ రాయల్, యూత్ లీడర్ జై చంద్ర నాయుడు, కదిరి ప్రసాద్ నాయుడు, సగినాల ఖాదరయ్య పాల్గొన్నారు.

సజావుగా కౌలు భూముల వేలం

చిన్నమండెం : మండల పరిధిలోని దేవగుడిపల్లె గ్రామంలో వెలసియున్న శ్రీ మండెం లక్ష్మీ నరసింహస్వామి ఆలయం వద్ద ఆలయ కౌలు భూముల వేలంపాట బుధవారం సజావుగా జరిగింది. ఆలయ ఈఓ కొండారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన వేలంపాటకు పలువురు రైతులు పాల్గొన్నారు. పలు గ్రామాలలో ఉన్న ఆలయ భూములకు సంబంధించి వేలం ప్రక్రియను అధికారులు పూర్తి చేశారు.

పలు దుకాణాలకు జరిమానా

లక్కిరెడ్డిపల్లె : మండలంలోని పొగాకు ఉత్పత్తులు విక్రయిస్తున్న దుకాణదారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు జరిమానాలు విధిస్తామని లక్కిరెడ్డిపల్లె ఎస్ఐ రవీంద్రబాబు పేర్కొన్నారు. బుధవారం మండలంలోని పాఠశాలల సమీపంలో ఉన్న వివిధ చిల్లర దుకాణాలను తనిఖీ చేసి పొగాకు ఉత్పత్తులు విక్రయిస్తున్న దుకాణదారులకు జరిమానాలు విధించినట్లు ఎస్ఐ తెలియజేశారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సూచనలు పాటిస్తే దిగుబడులు

లక్కిరెడ్డిపల్లె : రైతులు వ్యవసాయ అధికారుల సూచనలు, సలహాలు పాటిస్తే మంచి దిగుబడులు సాధించవచ్చునని వ్యవసాయాధికారి రాజకుమారి పేర్కొన్నారు. బుధవారం పందిళ్లపల్లెలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని స్థానిక రైతులతో కలిసి నిర్వహించారు.రైతులకు నానో యూరియా, నానో డీఏపీపై వాటి ఉపయోగాల గురించి వివరించారు. అన్నదాత సుఖీభవ అభ్యంతరాలను తెలపాలన్నారు.

పోటీతత్వంతోనే ప్రతిభకు గుర్తింపు



బహుమతులను అందుకున్న విద్యార్థులతో డైట్ అధికారులు, సిబ్బంది

రాయచోటి : చిన్నతనం నుండి విద్యార్థులు ఇతరులతో పోటీపడి చదివినపుడే వారి ప్రతిభకు గుర్తింపు లభిస్తుందని డైట్ ప్రిన్సిపల్ ఎంఆర్ఎస్ అజయ్‌కుమార్‌బాబు అన్నారు. బుధవారం ఉదయం రాయచోటిలోని డైట్‌లో జిల్లా స్థాయిలో మాదక ద్రవ్యాల దుర్వినియోగం, పెయింటింగ్, లింగ సమానత్వంపై వ్యాసరచన పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మాదక ద్రవ్యాల అలవాటుతో భవిష్యత్తు నాశనం అవుతుందన్నారు. వాటి నివారణకు సమష్టిగా కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. లింగ సమానత్వం అనేది ప్రతి ఒక్కరి ప్రాథమిక హక్కు అని ఇది అభివృద్ధి చెందుతున్న సమాజానికి పునాది వంటిదన్నారు.

జిల్లా స్థాయి విజేతలు వీరే

ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా ఉమ్మడి కడప జిల్లాలోని క్లస్టర్ కాంప్లెక్స్ స్థాయిలో విజేతలైన విద్యార్థులకు జిల్లా స్థాయిలో బుధవారం ఉదయం డైట్‌లో మాదకద్రవ్యాల వినియోగం, లింగ సమానత్వం, పెయింటింగ్‌లపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. మాదకద్రవ్యాల దుర్వినియోగంపై నిర్వహించిన పెయింటింగ్‌లో పోటీలలో రాజంపేట మండలం బోయినపల్లి ఎస్‌జెఎస్ఎం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థిని పి.మల్లీశ్వరి ప్రథమ స్థానం, అదే పాఠశాలకు చెందిన కె.సుప్రియ ద్వితీయ స్థానం, ఓబులవారిపల్లి మండలం సంజీవపురం ఏపీఎస్‌డబ్ల్యూఆర్ఎస్ పాఠశాల విద్యార్థి పి.సూర్య తృతీయ స్థానాన్ని కైవసం చేసుకున్నారు. లింగ సమానత్వంపై నిర్వహించిన పోటీలలో టి.సుండుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని ఎస్.మదిహ ప్రథమస్థానం, రాజంపేట గవర్నమెంట్ హైస్కూల్ విద్యార్థిని జె.రాధిక ద్వితీయ స్థానం అదే పాఠశాలకు చెందిన విద్యార్థిని ఎస్.తహనీ తృతీయ స్థానం సాధించారు. సంబేపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థిని మౌనిక, రాయచోటి మోడల్ స్కూల్ విద్యార్థి ఉదయ్‌కిరణ్‌లు ప్రోత్సాహక బహుమతులను కైవసం చేసుకున్నారు. పెయింటింగ్, వ్యాసరచన పోటీలలో విజేతలుగా నిలిచిన వారికి ప్రిన్సిపల్ తన చేతులమీదుగా ప్రశంసాపత్రాలను, పతకాలను, నగదు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో డైట్ సీనియర్ లెక్చరర్ మడితాటి నరసింహారెడ్డి, లెక్చరర్స్ శివభాస్కర్, వైసీ రెడ్డప్పరెడ్డి, తిరుపతి శ్రీనివాసులు, మోహన్‌నాయక్, కేదార్‌నాథ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక జ్ఞాన మార్గదర్శి 'గురువు'

- నేడు గురుపౌర్ణమి
- సాయిబాబా ఆలయాల్లో ప్రత్యేక పూజలకు ఏర్పాట్లు



సాయిబాబా మూలవిరాట్

రాజంపేట టౌన్ : మనిషి జ్ఞానవంతంగా ఎదగడంలో గురువుది ముఖ్య భూమిక. మనిషి జన్మించగానే తొలుత తల్లి, ఆ తరువాత నాన్న, అనంతరం ఉపాధ్యాయుడు జ్ఞాన సాధకుడిగా మనిషి ఉన్నతికి తోడ్పతారు. ప్రతి మనిషి జీవితంలో గురువు పాత్ర విశేషమైనది. శరీరానికి ఆహారం ఎంత అవసరమో వ్యక్తిత్వానికి జ్ఞానం అంతే అవసరం. ఆ జ్ఞానాన్ని ప్రసాదించే గురువుకు కృతజ్ఞతలు చెప్పేందుకు గురుపూర్ణిమను మంచి అవకాశంగా భావిస్తారు. జీవితానికి మార్గనిర్దేశం చేసి మంచి భవిష్యత్తును అందించినందుకు చదువు చెప్పే గురువుల పట్ల ఆరాధన భావంతో ఉంటారు. గురుపౌర్ణమి వేడుకలను గురువారం ప్రజలు, భక్తులు ఘనంగా నిర్వహించుకునేందుకు ఏర్పాట్లు చేసుకున్నారు.

ఆది గురువు వ్యాసుడే

ఆది గురువు వేద వ్యాసుడు. ఆయన జయంతినే గురుపౌర్ణమి, వ్యాస పూర్ణిమగా వ్యవహరిస్తారు. వ్యాసుడు మానవజాతికి ఆధ్యాత్మికతను వారసత్వంగా అందించాడు. ఆ వారసత్వాన్ని కొనసాగించేందుకు ఆయన పేరిట ప్రతి ఆషాడ శుద్ధ పౌర్ణమి నాడు వ్యాస పూర్ణిమగా నిర్వహిస్తారు. వేదకాలం నాటి సంస్కృతిని నాలుగు వేదాల్లో ఇమడ్చడంతో ఆయనను వేద వ్యాసుడిగా పిలుస్తున్నారు.

ప్రత్యేక పూజలు, ఉపవాసాలు

గురుపౌర్ణమి రోజు అనేక మంది భక్తులు సాయిబాబా, దత్తాత్రేయ ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరుపుతారు ఉపవాసం ఆచరిస్తారు. సూర్యోదయం వేళ ఉపవాసం ఆరంభించి చంద్రోదయాన ఉపవాసం ముగిస్తారు. ఆలయాల్లో నిర్వహించే పూజల్లో పాల్గొంటారు. మనిషి ఆధ్యాత్మికంగా ఔన్నత్యాన్ని కల్పించేందుకు కృషి చేస్తున్న గురువులకు పాదపూజలు నిర్వహిస్తారు.

ముస్తాబైన ఆలయాలు

గురుపౌర్ణమి రోజు సాయిబాబా, దత్తాత్రేయుని ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. పలు ప్రాంతాల్లోని సాయిబాబా ఆలయాల్లో ఆషాడ శుద్ధ పున్నమి రోజు నుంచి మూడు రోజుల పాటు ఆలయాల్లో ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. జిల్లాలోని అనేక ఆలయాల్లో గురుపౌర్ణమిని పురస్కరించుకొని ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించనున్నారు. ఇందుకోసం భక్తులు ఏర్పాట్లు చేశారు.

ఉన్నతమైనది ఉపాధ్యాయ వృత్తి



ఉపాధ్యాయుడు మధుసూదన్ రెడ్డిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే ఆకేపాటి అమర్నాథ రెడ్డి

పెనగలూరు : ఉపాధ్యాయ వృత్తి ఎంతో ఉన్నతమైందని రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్నాథ రెడ్డి అన్నారు. బుధవారం పెనగలూరు హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు అంకిరెడ్డి మధుసూదన్ రెడ్డి పదవీ విరమణ సందర్భంగా ఆ పాఠశాల సిబ్బంది సన్మాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆకేపాటి హాజరై మాట్లాడారు. దేశాభివృద్ధికి పాటుపడే ప్రతి ఉద్యోగి ఉపాధ్యాయుడి దగ్గర విద్యాబుద్ధులు నేర్చుకున్నవారేనని కితాబిచ్చారు. అందుకే దేశంలోకల్లా ఉపాధ్యాయ వృత్తి ఎంతో విలువైందన్నారు. అనంతరం సుదర్శన్ రెడ్డి పదవీ విరమణ పొందిన హెచ్ఎం మధుసూదన్ రెడ్డి, భారతి దంపతులను దుశ్శాలువాలతో సత్కరించి మెమెంటోను అందజేశారు. కార్యక్రమంలో పెనగలూరు హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు అల్లం మహేష్ నాయుడు, పదవీ విరమణ పొందిన ఉపాధ్యాయుడు పుచ్చకాయల ఎల్లయ్య, ఎంఈఓ గిరి వరదయ్య, మండలంలోని వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు వెంకట సుబ్బయ్య, గంగాధర్ బాబు, గోపాలకృష్ణ, ఎస్టీయూ నాయకుడు పిల్లి రామకృష్ణ, అశోక్ కుమార్, వైఎస్ఆర్టీఎస్ రాష్ట్ర నాయకుడు తలమంచి రమణారెడ్డి, జెడ్పీటీసీ సుబ్బరాయుడు, పలు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పశుగ్రాసాన్ని సాగు చేయాలి

రాజంపేట రూరల్ : పాడి పశువులను పోషించే రైతులు తమ పొలాలలో పశుగ్రాసాన్ని పెంపొందించాలని పశు సంవర్ధక శాఖ ఉపసంచాలకులు డాక్టర్ వై.విజయభాస్కర్ కోరారు. మండల పరిధిలోని ఆకేపాడు రైతు సేవా కేంద్రంలో బుధవారం పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో పశుగ్రాస వారోత్సవాల కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఏడీఏ విజయభాస్కర్ వివిధ రకాల గడ్డిజాతులు వాటి సాగు ప్రాముఖ్యతను వివరించారు. అదే విధంగా రెడ్ నేపియర్, సూపర్ నేపియర్, ఏపీబీఎన్, మునగ, అవిశ, వంటి పశుగ్రాసాల గురించి తెలియజేశారు. రైతులందరూ పశు గ్రాసంపై దృష్టి సారించి పాల దిగుబడిని పెంపొందించుకోవాలని కోరారు.

ఔదార్యం చాటుకున్న కువైట్ ప్రవాసాంధ్ర రెడ్డి సంఘం



సుబ్బారెడ్డి కుటుంబీకులకు నగదును అందజేస్తున్న ఎమ్మెల్యే ఆకేపాటి, రెడ్డి సంఘం ప్రతినిధులు

రాజంపేట రూరల్/పుల్లంపేట : ప్రవాసాంధ్ర రెడ్డి సంఘం కువైట్ వ్యవస్థాపకులలో ఒకరైన పుల్లంపేట మండలం రంగంపల్లి గ్రామానికి చెందిన జీకే సుబ్బారెడ్డి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. అతని కుటుంబీకులకు మండల పరిధిలోని ఆకేపాటి ఎస్టేట్‌లో బుధవారం వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి చేతులమీదుగా ప్రవాసాంధ్ర రెడ్డి సంఘం కువైట్ ప్రతినిధులు రూ.50 వేలు నగదును అందజేశారు.

సౌమ్యనాథుడిని దర్శించుకున్న ప్రముఖులు



ఆలయ ప్రాంగణంలో ఎంపీ మేడా, ఎమ్మెల్యే ఆకేపాటి, ఎంపీపీ తదితరులు

నందలూరు : జిల్లాలో ప్రసిద్ధిగాంచిన చారిత్రాత్మక శ్రీ సౌమ్యనాథ స్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా రాజ్యసభ సభ్యులు (ఎంపీ) మేడా రఘునాథరెడ్డి, రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథరెడ్డి, ఎంపీపీ మేడా విజయభాస్కర్‌రెడ్డిలు పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు. ముందుగా ఆలయ అర్చకులు వారికి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం స్వామి వారికి ప్రత్యేక పూజలు చేయించి, తీర్థప్రసాదాలు పొందారు. అనంతరం ఆలయ అర్చకులు నాయకులకు పూలమాల శాలువాతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ గొబ్బిళ్ల త్రినాథ్, ఆలయ మాజీ చైర్మన్ అరిగెల సౌమిత్రి, మహిళా మండలి అధ్యక్షురాలు పల్లె మాధవి, వైఎస్ఆర్‌సీపీ నాయకులు గడికోట వెంకటసుబ్బారెడ్డి, మోహన్ రెడ్డి, గీతాల నరసింహారెడ్డి, ఖలీమ్, నడివీధి సుధాకర్, సోమిశెట్టి ప్రభాకర్, పుణగాని గుణ, భాస్కర్ యాదవ్, తుమ్మల శ్రీధర్‌గౌడ్, మోదుగుల చంద్ర, షావలీ, అజీజ్, ఆనాల మధుయాదవ్, షేక్ మహమ్మద్‌అలీ, విజే యుడు, నాగసుబ్బయ్య, అరిగే నాని, చింతకాయల యల్లయ్య, గంగినాయుడు, కాకి చంద్రమోహన్, ఎముక దుర్గయ్య, సుధాకర్, శంకర, కడప హరి, రాజశేఖర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, మహబూబ్‌బాషా, బ్యాంకు నారాయణ, మోడపోతుల సుధాకర్, పనతల గంగయ్య, దేవి, వాణిశ్రీ తదితరులు పాల్గొన్నారు.

కచ్చితమైన సమాచారంతో సభకు రావాలి

చిట్వేలి : కచ్చితమైన సమాచారంతో మండల సమావేశానికి రావాలని అలా కాని పక్షంలో సభకు రావాల్సిన అవసరం లేదని రైల్వేకోడూరు ఎమ్మెల్యే, ప్రభుత్వవిప్ అరవ శ్రీధర్ అధికారులను ఉద్దేశించి అన్నారు. బుధవారం ఎంపీపీ అధ్యక్షులు టంగుటూరి చంద్ర అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే శ్రీధర్, ఖాదీ, గ్రామీణ పరిశ్రమల అభివృద్ధి బోర్డు చైర్మన్ కెకె చౌదరిలు పాల్గొన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలకు సుపరిపాలన అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. అనంతరం వివిధ శాఖలపై సమీక్ష జరిపారు. అనంతరం కెకె చౌదరి అధికారులకు పలు సూచనలు చేశారు. రాజుకుంట ఎంపీటీసీ సభ్యులు నాగార్జున పలు సమస్యలను అధికారుల దృష్టికి తెచ్చారు. ఎంపీడీఓ శ్రీనివాసులు మాట్లాడుతూ ముందస్తు సమాచారంతో సభకు రావాలని, అలా రావడం వలన సభ్యులకు సమాధానాలు చెప్పడం సులువుగా ఉంటుందని అధికారులకు సూచించారు. సమావేశంలో వైస్ ఎంపీపీ సుబ్రమణ్యం రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రవికుమార్ రాజు, సీఐ వెంకటేశ్వర్లు, ఏడీఈ బాలాజీ, హెచ్ఎం దుర్గరాజు, ఎంఈఓలు కోదండనాయుడు, ఈశ్వరయ్య, డాక్టర్ అన్సారీ, ఏఓ సుధాకర్, ఏఈలు గిరిధర్, వెంకటాచలపతి, ఏపీఓ రవికుమార్, ఏపీఎం చంద్రకళ, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, వీఆర్ఓలు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి చేద్దాం



రాయచోటి టౌన్: కార్యకర్తలతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి

రాయచోటి టౌన్ : రాయచోటి రూరల్ మండలం ఎగువ అబ్బవరం గ్రామంలో రాష్ట్ర వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్‌రెడ్డి పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన ప్రజలను, నాయకులు, కార్యకర్తలను పేరుపేరునా ఆప్యాయంగా పలకరించి యోగక్షేమాలను వాకబు చేశారు. ఈ క్రమంలోనే ప్రజలు వారి కష్టాలను శ్రీకాంత్‌రెడ్డికి మొరపెట్టుకున్నారు. అనంతరం మాజీ కౌన్సిలర్ ఆనందరెడ్డి నివాసంలో పార్టీ కార్యకర్తలు, నాయకులతో కలసి పార్టీ అభివృద్ధిపై చర్చించారు. అందరం కలసికట్టుగా పని చేసి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని బలోపేతానికి కృషి చేద్దామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ పోలు సుబ్బారెడ్డి, కౌన్సిలర్ చంద్రశేఖర్, గ్రామ నాయకులు సహదేవ రెడ్డి, వెంకట్రామిరెడ్డి, రెడ్డెప్ప రెడ్డి, జయపాల్, దుగ్గిరెడ్డి, రెడ్డెయ్య, నాగరాజు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడికి నివాళి

రాయచోటి జగదాంబసెంటర్ : రాయచోటి మండలం గొర్లముదివీడు గ్రామం బాలిరెడ్డిగారిపల్లెకు చెందిన ఉపాధ్యాయుడు బసిరెడ్డి వెంకటసుబ్బారెడ్డి అనారోగ్యంతో మృతిచెందారు. సుబ్బారెడ్డి భౌతికకాయాన్ని బుధవారం వైఎస్ఆర్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్‌రెడ్డి సందర్శించి నివాళులర్పించారు. ఆయన మృతి పట్ల సంతాపం తెలిపి వారి కుటుంబసభ్యులను పరామర్శించారు. ఆయన వెంట మాజీ ఎంపీపీ పోలు సుబ్బారెడ్డి, టీటీడీ సలహా మండలి మాజీ సభ్యుడు బసిరెడ్డి సిద్ధారెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ గంగిరెడ్డి, సింగిల్ విండో మాజీ అధ్యక్షుడు బసిరెడ్డి సుబ్బారెడ్డి, నాయకులు తదితరులు నివాళులు అర్పించిన వారిలో ఉన్నారు.

ఉపాధ్యాయునికి సన్మానం



నందలూరు : గొల్లపల్లి ప్రాథమిక పాఠశాలలో దాదాపు 8 సంవత్సరాలుగా పనిచేసి ఇటీవల బదిలీపై పాటూరు ప్రాథమిక పాఠశాలకు వెళ్లిన ఉపాధ్యాయుడు వై.మహేశ్వరబాబుకు రాజంపేట వ్యవసాయ మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ గొబ్బిళ్ల త్రినాథ్, గొల్లపల్లి ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు నాగమల్లీశ్వరి, బిలాల్‌లు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓలు నాగయ్య, అనంతకృష్ణ, గొబ్బిళ్ల రవి, గొబ్బిళ్ల నాగముని, పి.ఆదినారాయణ, బి.సుబ్బరాయుడు, పాఠశాల కమిటీ చైర్మన్ పి.సుగుణ, గ్రామ పెద్దలు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.


వైఎస్ జగన్‌పై ఉన్న అభిమానాన్ని తగ్గించలేరు

రాయచోటి జగదాంబసెంటర్ : మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై ప్రజలకు ఉన్న అభిమానాన్ని తగ్గించలేరనడానికి బుధవారం జరిగిన బంగారుపాళ్యం పర్యటన ఉదాహరణ అని వైఎస్ఆర్‌సీపీ బీసీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి సిబ్యాల విజయభాస్కర్ పేర్కొన్నారు. బుధవారం రాయచోటి పట్టణంలోని వైఎస్ఆర్‌సీపీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వైఎస్ జగన్ బంగారుపాళ్యం పర్యటనకు వస్తున్నారని తెలసుకొని వెళ్తున్న మామిడి రైతులను, రోడ్డు వెంబడి వెళ్తున్న ద్విచక్ర వాహనాల్లో వెళ్తున్న అభిమానులను పోనివ్వకుండా కూటమి ప్రభుత్వం అడ్డుకోవడం దారుణమన్నారు. జగన్‌కు వస్తున్న ప్రజాదరణ చూసి ఓర్వలేని కూటమి ప్రభుత్వం అప్రజాస్వామికంగా ప్రవర్తిస్తోందని ఆరోపించారు. ఆనాడు దివంగత నేత వైఎస్ఆర్ రైతులను అన్ని విధాలా ఆదుకున్న తరహాలోనే వైఎస్ జగన్ హయాంలో రైతులకు గిట్టుబాటు ధర కల్పించి వారిని ఆదుకున్నాడని గుర్తు చేశారు. వైఎస్ జగన్‌పై ఆంక్షలు విధించడం మానేసి పూర్తిస్థాయి రక్షణ కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు.

దేశ పునర్నిర్మాణం కోసం కృషి చేద్దాం

రాయచోటి జగదాంబసెంటర్ : దేశ పునర్నిర్మాణం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) అన్నమయ్య జిల్లా నాయకుడు జేపీ నాగిరెడ్డి తెలిపారు. ఏబీవీపీ 77వ ఆవిర్భావ దినోత్సవాన్ని రాయచోటి పట్టణంలోని ప్రతిభా జూనియర్ కళాశాలలో బుధవారం సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా నాగిరెడ్డి మాట్లాడుతూ 1949 జులై 9న ఏబీవీపీ ఢిల్లీలో ప్రారంభమై నేడు దేశంలోనే అతిపెద్ద విద్యార్థి సంస్థగా అవతరించిందన్నారు. జ్ఞానం, శీలం, ఏక్తా విధానాలే సాధనాలుగా జాతీయత ఊపిరిగా విద్యార్థి యువతను జాగృతం చేస్తూ సామాన్య విద్యార్థులను సైతం సేవా సంఘర్షణ సంస్కారవంతమైన లక్షణాలు కలిగిన నాయకులుగా మలుస్తూ నిరంతరం విద్యార్థుల సమస్యలపై పోరాటం చేస్తున్నటువంటి ఏకైక విద్యార్థి సంస్థ ఏబీవీపీ అని తెలియజేశారు. కార్యక్రమంలో మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ చైర్మన్ శివగంగిరెడ్డి, లెక్చరర్ జగన్మోహన్‌రెడ్డి, ఏబీవీపీ టౌన్ సెక్రటరీ విజయ్, సంఘ నాయకులు పాల్గొన్నారు.

'జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకుందాం'



శ్రీకాంత్‌రెడ్డిని కలిసిన గాలివీడు యువజన నాయకులు

గాలివీడు : రాష్ట్రంలో జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకుందామని వైఎస్సార్ సీపీ మండల యువజన విభాగం అధ్యక్షుడు మంచూరి వెంకటరమణారెడ్డి, మైనారిటీ నాయకులు వేంపల్లి షామీర్ అన్నారు. మండలంలో యువజన విభాగం నూతన కమిటీ ఏర్పడిన తరువాత మొదటిసారిగా మాజీ ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్ రెడ్డిని కలసి పూలమాలలు, దుశ్శాలువాతో సత్కరించారు. రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో తమ నాయకుడు శ్రీకాంత్ రెడ్డిని గెలిపించుకునేందుకు శాయశక్తులా కృషి చేస్తామన్నారు. అందులో భాగంగా త్వరలో జగనన్న అభివృద్ధి, సంక్షేమం గ్రామాల్లో ప్రజలకు వివరించడంతో పాటు కూటమి ప్రభుత్వం మోసపూరిత వాగ్దానాలపై ప్రజలను చైతన్య పరచడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పలు గ్రామాల వైఎస్సార్‌సీపీ యువజన విభాగం నాయకులు, అనుబంధ సంఘాల అధ్యక్షులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన బొప్పరాజు



జిల్లా కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఏపీఆర్ఎస్ఏ రాష్ట్ర, జిల్లా నాయకులు

రాయచోటి టౌన్ : అన్నమయ్య జిల్లా కలెక్టర్ శ్రీధర్ ఛామకూరితో రెవెన్యూ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు, జేఏసీ అమరావతి రాష్ట్ర చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు కలిసి పలు సమస్యలపై చర్చించారు. బుధవారం అన్నమయ్య జిల్లా ఏపీఆర్ఎస్ఏ నాయకులతో ఆయన కలెక్టర్‌ను కలిశారు. మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలు, రెవెన్యూ అధికారులు, సిబ్బంది సమస్యలపై చర్చించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీఆర్ఎస్ఏ ప్రెసిడెంట్ నరసింహాకుమార్, కడప ప్రెసిడెంట్ జీవన్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాల తనిఖీ



విద్యార్థులకు సూచనలు చేస్తున్న అధికారి

సుండుపల్లె : మండల పరిధిలోని పుల్లారెడ్డిగారిపల్లె సమీపంలో ఉన్న గిరిజన సంక్షేమ గురుకుల బాలుర పాఠశాలను బుధవారం యోగా ప్రత్యేకాధికారి సురేష్‌కుమార్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులందరూ చదువు పట్ల శ్రద్ధ చూపాలన్నారు. అనంతరం పాఠశాలలో వంటగది, భోజనశాల, స్టోర్‌రూం, డార్మెంటరీ, టాయిలెట్స్‌లను పరిశీలించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటేశ్వరనాయుడు, విద్యార్థులు పాల్గొన్నారు.

పెల్లుబికిన నిరసన జ్వాలలు

లేబర్ కోడ్‌లను ఉపసంహరణతోపాటు కార్మికుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ కార్మిక సంఘాలు పిలుపునిచ్చిన దేశవ్యాప్త సమ్మె బుధవారం విజయవంతమైంది. సమ్మెలో వివిధ రంగాలకు చెందిన ఉద్యోగులు, కార్మికులు పాల్గొని తమ నిరసనను తెలియజేశారు. కార్మిక నాయకులు మాట్లాడుతూ లేబర్ కోడ్‌లను రద్దు చేయాలన్నారు. ఉపాధి కూలీలకు రూ.600లు కూలీ చెల్లించాలన్నారు. రైతు రుణాలు మాఫీ చేయాలని కోరారు. ప్రభుత్వ సంస్థల కార్పొరేటీకరణను కేంద్ర ప్రభుత్వం విరమించుకోవాలన్నారు. కార్మిక సమస్యలను అనేక విధాల ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్తున్న పట్టించుకోకపోవడం దుర్మార్గమన్నారు. కార్మికులను కట్టు బానిసలుగా చేసేలా తీసుకున్న నిర్ణయాలను వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కాగా రాజంపేటలో శాంతియుతంగా జరుగుతున్న నిరసనను పోలీసులు అడ్డుకున్నారు. దీంతో కార్మికులు, పోలీసులకు స్వల్ప వాగ్వివాదం చోటు చేసుకుంది. అనంతరం కార్మికులు ఆయా మండలాల అధికారులకు వినతిపత్రం అందజేశారు.

– సాక్షి, నెట్‌వర్క్



రాయచోటి టౌన్: ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి నుంచి సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ నాయకుల ర్యాలీ



నందలూరు: సమ్మెలో పాల్గొన్న కార్మికులు



చిన్నమండెం: తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన



పెనగలూరు: వైఎస్సార్ సర్కిల్ వద్ద మానవహారం



రైల్వేకోడూరు అర్బన్ లేబర్ కోడ్‌ల రద్దు చేయాలంటూ..



ఒంటిమిట్ట: వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో..



సంబేపల్లె: సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన



సిద్దవటం: ర్యాలీ నిర్వహిస్తున్న కార్మిక సంఘాలు, అంగన్వాడీ వర్కర్‌లు, వీఆర్ఏలు



రాజంపేట టౌన్: ధర్నా చేస్తున్న ఎల్ఐసీ ఉద్యోగులు



లక్కిరెడ్డిపల్లె: మూడు రోడ్ల కూడలిలో అంగన్వాడీల మానవహారం